# పాఠం 7

# తిరుగుబాటు యొక్క అలంకార పదాలు

## (హోషేయ 7)

హోషేయ తన సందేశాన్ని ఇశ్రాయేలుకు తరుచుగా అలంకార రూపాలో తేలియజేశాడు. 7వ అధ్యాయంలోనే నాయకులను వ్యభిచారులుగా, మాడిపోయిన అప్పము వంటి వారుగా పోల్చాడు. దేశం "ఎవరునూ త్రిప్పి వేయని అప్పము," ముసలి వారు, మరియు పిరికి "గుండెగల గువ్వ" వంటిది. వీటన్నిటి వివరణతో ఇశ్రాయేలు దేవుని నుండి దూరమవ్వడాన్ని హోషేయ వివరిస్తున్నాడు. వారు చేసిన పాపమునకు ఫలితం ఏమంటే, దేవుడు వారిని "బాగుచేసేందుకు," "విమోచించేందుకు" ఇష్టపడినా వారు శిక్షనొందాల్సిందే.

### కామాతురత గలవారు మరియు వేడిచేయబడిన పొయ్యి (7:1–4)

> [1]నేను ఇశ్రాయేలువారికి స్వస్థత కలుగజేయదలంచగా ఎఫ్రాయిము దోషమును షోమ్రోను చెడుతనమును బయలుపడుచున్నది. జనులు మోసము అభ్యాసము చేసెదరు; కొల్లగాండ్రయి లోపలికి చొరబడుదురు, బందిపోటు దొంగలై బయట దోచుకొందురు. [2]తమ క్రియల చేత వారు చిక్కుపడి యున్నను అవి నా సముఖముననే జరిగినను – మన చెడుతనమును ఆయన జ్ఞాపకము చేసికొనడని తమలోతాము అనుకొందురు. [3]వారు చేయు చెడుతనము చూచి రాజు సంతోషించును; వారు కల్లలాడుతు అధిపతులు విని సంతోషింతురు. [4]రొట్టెలు కాల్చువాడు ముద్ద పిసికిన తరువాత ముద్దంతము పొంగువరకు పొయ్యిని అధికముగా వేడిమి ఊరకుండునట్లు వారందరు మానని కామాతురత గలవారైయున్నారు.

"నేను ఇశ్రాయేలు వారికి స్వస్థత కలుగ చేయ దలంచగా" అన్న మొదటి వాక్యం మునుపటి అధ్యాయపు చివరి వాక్యం "నా ప్రజలను నేను తిరిగి రప్పింతును" అన్న వాక్యంతో కలిసి యుండాలని చెప్తారు. లియోన్ జె. వుడ్ ఇలా చెప్తున్నారు – "ఇశ్రాయేలుకు సహాయం చేయడం మరియు స్వస్థపర్చడం" అన్న రెండు వాక్యాలు దేవుడు ప్రవక్తలను హెచ్చరించడం మరియు ఆక్షేపించడం గురించి చెప్తున్నాయి.[1] దేవుని మాటలు తన ప్రజలపట్ల ఆయనకున్న ప్రేమను చూపిస్తున్నాయి (చూడండి 7:13). తన ప్రజలు తిరిగి పునరుద్ధరించబడాలని స్వస్థత నొందాలని ఆయన కోరుకుంటున్నాడు. వారి నాశనమును ఆయన ఆనందించాడు.[2] ఇశ్రాయేలు లేదా షోమ్రోను[3] ఆశీర్వదించక పోవడానికి గల ఒక కారణం: వారి పాపములు లేదా దోషములు, ఏ పాపములు వారిని దోషులుగా ఉంచాయి? వారు మోసంగా ప్రవర్తించారు. వారిలో దొంగలు, బందిపోటు దారులున్నారు[4] (7:1). వారికున్న సమస్య ఏమంటే, దేవుడు వారి పాపాలను గుర్తుంచుకుంటాడని వారి దోషక్రియలను బట్టి శిక్షిస్తాడని వారు గుర్తించలేకపోయారు (7:2). వారి పాపాలు దేవునికి దుఃఖాన్ని కలుగజేయగా, వారి "రాజు" "అధిపతుల"కు అవి సంతోషాన్నిచ్చాయి. నీతి విషయంలో మాదరిగా ఉండాల్సిన నాయకులే దుర్మార్గతలో ఆనందిస్తున్నారు (7:3).

అంతేగాకుండా ఇశ్రాయేలు యొక్క నాయకలు "కామాతురత గలవారు" వారి కామాతురత అనేది అన్యదేవతా ఆరాధన లేదా అన్యాయపు తీర్పులను గుర్తించినదై యుండవచ్చు (7:4).

## కాలుచున్న పొయ్యి మరియు త్రిప్పి వేయని అప్పము (7:5–8)

> [5]మన రాజు దినమున అధిపతులు అతని ద్రాక్షారస బలము చేత మత్తిల్లి జబ్బుపడిరి; రాజు తానే అపహాసకులకు చెలికాడాయెను. [6]పొయిలో పడినట్టు వారు తమ హృదయములను మాటలోనికి తెచ్చుకొని యున్నారు; తమలో రొట్టెలు కాల్చువాడు రాత్రియంతయు నిద్రపోయినను ఉదయమున పొయ్యి బహు మంట మండి కాలుచున్నది. [7]పొయ్యి కాలునట్లు వారందరూ బహు మంటమండి తమ న్యాయాధిపతులను మ్రింగివేయుదురు, వారి రాజులందరును కూలిరి, వారిలో నన్ను స్మరించువాడొకడును లేడు. [8]ఎఫ్రాయిము అన్యజనులతో కలిసిపోయెను; ఎఫ్రాయిము ఎవరును త్రిప్పివేయని అప్పమువంటి వాడాయెను.

తరవాతదిగా ఇశ్రాయేలు నాయకులలోనున్న త్రాగుబోతులను గురించి మాట్లాడుతున్నాడు హోషేయ. ఆ నాయకులు రాజు దినమున (రాజు యొక్క జన్మదినం లేదా వార్షికోత్సవం). అతడు జరిపించిన ఉత్సవములో ద్రాక్షరసము తాగి మత్తిల్లి జబ్బునొందియున్నారు. అక్కడకు వెళ్ళువారందరూ తమ చేతులు కలిపి తమ పాపములో ఇతరులను కలుపుతున్నారు (7:5). దురాలోచన, దురాశ, ఆవేశంతో కలిసి తమను తాము వారు చెడకొట్టకున్నారు. ఉత్సవం ముగిసిన తరువాత రోజు వారి కోపం "బహు మంట మండి కాలుచున్నది" గత రాత్రి వారు చేసిన దురాలోచనను జరిగించేందుకు ముందుకు సాగెదరు (7:6).

అయితే గతంలో వారు మత్తిల్లియున్నప్పుడు చేసుకున్న సంబంధ స్నేహాలు ఎంతో కాలం నిలువవు. నిజానికి ప్రజలు ప్రత్యేకించి అధిపతులు తమ న్యాయాధిపతులను అంతమొందిస్తారు. ఉత్తరరాజ్యపు చివరి కాలంలో రాజులు స్థిరంగా పాలించలేరు. "ఇశ్రాయేలీయులు తమ మానని హింస (*coups d'etat*) ద్వారా తమ న్యాయాధిపతులందరిని అంతమొందిస్తారు" అని ఒక వ్యాఖ్యానకర్త వ్రాస్తూన్నాడు.[5]

ఇశ్రాయేలీయుల రాజులలో "ఎవరూ" దేవున్ని ఆశ్రయించనందున వారు "కూలిపోతారు" (7:7). నిజానికి ఇశ్రాయేలీయుల పతనానికి కారణం, "వారు దేవుని మీద ఆనుకోలేకపోవడమే" వారు దేవున్ని ఆశ్రయించకుండా విగ్రహాలను ఆశ్రయించారు.

ఉత్తర రాజ్యపు పాప స్థితిని వివరించేందుకు ఇశ్రాయేలు లేదా ఎఫ్రాయిము "త్రిప్పివేయని అప్పము" అని దేవుడు వివరిస్తున్నాడు. పౌలు టి. బట్లర్ ఇలా వ్రాస్తున్నాడు,

> ఇక్కడ చెప్పబడిన "అప్పము" పలచగాఉండే పిండి రొట్టె, దీనికి ఒకవైపు మాత్రమే మంట హెచ్చుగా ఇయ్యబడింది. త్రిప్పివేయని అప్పము అంటే ఇది ఒకవైపు మాత్రమే బాగా ఉడికించబడగా, మరో వైపు ఉడక లేకుండా వదిలివేయబడి పిండి పిండిగా ఉండి పారవేయుటకు మాత్రమే తగినదిగా ఉంది.[6]

ఇలా ఇశ్రాయేలు యొక్క మధ్యస్థ స్థితికి కారణం వారు అన్యజనులతో కలిసి పోవడమే. వారి మధ్యలో నున్న అన్యులు వీరిని విగ్రహారాధనలోకి నడిపించారు. అంతేగాకుండా వీరు అన్యులతో కలిసి పోవడం వలన వారి దేవతలకు ఆశ్రయమిచ్చారు (7:8).

## బలహీనమైననూ గర్వించడం (7:9, 10)

> [9]అన్యులు అతని బలమును మ్రింగివేసినను అది అతనికి తెలియకపోయెను; తన తలమీద నెరసిన వెండ్రుకలు కనబడుచున్నను అది అతనికి తెలియదు. [10]ఇశ్రాయేలుకున్న ఆ అతిశయాస్పదము అతనిమీద సాక్ష్యము పలుకును. ఇంత జరిగినను వారు తమ దేవుడైన యెహోవాయొద్దకు తిరుగక యున్నారు, ఆయనను వెదకక యున్నారు.

ఇశ్రాయేలు ఎవరితోనైతే రాజకీయంగా, మతపరంగా, సాంస్కృతిక ఆచారపరంగా కలియకున్నాడో, వారే, ఆ "అన్యులే" అతని "బలాన్ని" మ్రింగివేసారు. వారు ఇశ్రాయేలును బలహీనంగా, జబ్బుతో నుండునట్లు చేశారు. దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకోలేని స్థితలో అది ఉంది. అన్యులతో ఇశ్రాయేలుకున్న సంబంధాలు అతడ్ని బలంగా చేయకుండా బలహీనుడ్ని చేశాయి.

ఇశ్రాయేలు తన క్షిణ దశకు చేరుకుంటున్నా, దాని తల "వెండ్రుకలు నెరసి" ముగింపునకు చేరుకుంటున్నా, దానిని ఎరుగకయే ఇశ్రాయేలు ఉంది (7:9).

ఇశ్రాయేలు గర్వపడింది. హోషేయ ప్రవచనం చెప్తున్న సమయంలో నాశనం కనుచూపు మేరలోనే కనబడుతున్నా, దేశం వర్ధిల్లుతున్నట్లేయుంది. అయితే ప్రజలు, తాము సాధించిన విజయాలకు దేవునికి ఘనతను ఇవ్వకుండా తమకు వాటిని ఆపాదించుకున్నారు. ఆ విధంగా వారి గర్వం వారి మీదనే సాక్ష్యమిచ్చింది. దేవుని యందలి అవిశ్వాస్యతకు అది సాక్ష్యంగా నిలిచింది (చూడండి 5:5). దేవుని వెదుకక పోవడమే వారి పాపం అని హోషేయ మరోమారు చెప్తున్నాడు (7:10).

## పిరికి గువ్వ మరియు పడిపోయిన ఆకాశ పక్షులు (7:11, 12)

> [11]ఎఫ్రాయిము బుద్ధిలేని పిరికి గుండెగల గువ్వయాయెను; వారు ఐగుప్తీయులను పిలుచుకొందురు. అష్షూరీయుల యొద్దకు పోవుదురు. [12]వారు వెళ్లగా నేను వారిపైని నా వల వేయుదును, ఆకాశ పక్షులను ఒకడు కొట్టునట్టి వారిని పడగొట్టుదును, వారి సమాజమునకు నేను ప్రకటించిన ప్రకారము నేను వారిని శిక్షింతును.

ఇశ్రాయేలును "త్రిప్పివేయని అప్పము" (7:8), "నెరసిన వృద్ధునిగా" (7:9), పోల్చిన తరువాత దేవుడు ఇశ్రాయేలును "బుద్ధిలేని పిరికి గుండె గువ్వ"తో (7:11) పోల్చుతున్నాడు. ఎందుకు? ఎందుకంటే వారు తమకు సహాయం కోరుతూ లేదా విమోచనను అర్థిస్తూ ఒక దేశం నుండి మరోదేశం, అష్షూరు మరియు ఐగుప్తు వంటి దేశములను అర్థిస్తూ తిరుగుతున్నారు. అటువంటి సహాయాలను అర్థించడం అర్థరహితం ఎందుకంటే (1) వారు దేవున్ని ఆశ్రయించి యుంటే ఆయన వారిని తప్పక విమోచించేవాడు; (2) దేవుడు అటువంటి సంబంధాలను ఖండిస్తున్నాడు; మరియు (3) దేవుని అనుమతి లేకుండా అటువంటి సంబంధాలు నిరర్థకమే.

అలంకార పదాలను ఇంకనూ వాడుతూ, వారు పిరికి గుండెగల గువ్వ వలె ఉన్నారు కాబట్టి దేవుడు వారి మీద వల విసిరి వారిని పట్టుకుంటానని చెప్తున్నాడు. "తరువాత వారి సమాజమునకు ఆయన ప్రకటించిన రీతిగా" ఆయన వారిని శిక్షిస్తాడు. వారి ప్రవక్తలు వారికి ప్రకటించిన రీతిగానే వారికి శ్రమ కలుగుతుంది (7:12).

7:12లోని చివరి మాట “వారి సమాజమునకు నేను ప్రకటించిన ప్రకారము నేను వారిని శిక్షింతును” – అన్న మాట యొక్క మూల హెబ్రీ వాక్యం తర్జుమాకు కష్టసాధ్యమైంది. దీని విషయమై భిన్న తర్జుమాలు భిన్నంగా చెప్తున్నాయి:

> వారి సమాజము విన్న రీతిగానే నేను వారిని శిక్షింతును (NKJV).
>
> వారి సమాజమంతయు కూడియున్నదని నేను వినినప్పుడు నేను వారిని పట్టుకొందును (NIV).
>
> వారి సమాజమునకు చెప్పబడిన రీతిగానే నేను వారిని శిక్షింతును (NRSV).
>
> వారు కూడియున్నారని వినినప్పుడు నేను వారిని పట్టుకొందను (REB).
>
> క్షణ కాలములోనే వారి స్థలంనుండి నేను వారిని చెరగొందను (NAB).
>
> వారి దుర్మార్గతను బట్టి నేను వారిని శిక్షింతును (NJB).
>
> వారు శిక్షనొందేలా నేను తప్పక చేయుదును (CEV).

“వారి ఒప్పందాలు సమాచారం ఆధారంగా నేను వారిని శిక్షింతును” అని యాంకర్ బైబిలు చెప్తుంది.[7] తర్జుమాలు ఎలా ఉన్నా, ప్రతి తర్జుమా కూడా వాక్యం చివరన వారి యొక్క శిక్ష గురించే చెప్తుంది.

## అక్రమమైనవారు మరియు తిరుగుబాటుదారులు (7:13, 14)

> 13వారికి శ్రమ కలుగును; వారు నన్ను విసర్జించి తప్పిపోయి యున్నారు; వారికి నాశనము
> కలుగును; వారు నా మీద తిరుగుబాటు చేసియున్నారు; వారికి క్షయము సంభవించును.
> నేను వారిని విమోచింపకోరియున్నను వారు నామీద అబద్ధములు చెప్పుదురు.
> 14హృదయపూర్వకముగా నన్ను బ్రతిమాలు కొనక శయ్యలమీద పరుండి కేకల వేయుదురు;
> నన్ను విసర్జించి ధాన్య మద్యములు కావలెనని వారు గుంపులు కూడుదురు.

తరువాతిదిగా ప్రవక్త ఇశ్రాయేలు మీద “శ్రమను” ప్రకటిస్తున్నాడు. ఎందుకంటే వారు దేవున్ని “విసర్జించి” తప్పిపోయారు. దేవుడు వారిని “విమోచింప”యుండగా వారు ఆయన మీదనే అబద్ధములు చెప్తున్నారు కాబట్టి ఆయన వారిని శిక్షింపలేదు (7:13). వారు దేవున్ని మొర్ర పెట్టవలసి వస్తే, అది తమ అవసరతల కోసమే చేస్తున్నారు. అది హృదయపూర్వకముగా మొర్రకాదు ఎందుకంటే వారు నిజముగా ఆయన్ను ప్రేమించి తమ పాపములకై పశ్చాత్తాపం నొందలేదు. వారు ధాన్య నిమిత్తమై, “గుంపులుగా” కూడుదురు అయితే వారు దేవున్ని నిజముగా ఆరాధించక “ఆయన్ను విసర్జించియున్నారు” (7:14).

## అక్కరకు రాని విల్లు మరియు కత్తివారైన అధిపతులు (7:15, 16)

> 15నేను వారికి బుద్ధినేర్పి వారిని బలపరచినను వారు నామీద దుర్‌యోచనలు చేయుదురు.
> 16వారు తిరుగుదురు గాని సర్వోన్నతుడైన వాని యొద్దకు తిరుగరు; వారు అక్కరకు
> రాని విల్లువలె నున్నారు; వారి యధిపతులు తాము పలికిన గర్వపు మాటలలో చిక్కుపడి
> కత్తిపాలగుదురు. ఈలాగున వారు ఐగుప్తు దేశములో అపహాస్యము నొందుదురు.

ఇశ్రాయేలు యొక్క పాపపు స్థితి మరింత విచారించదగినది, దేవుడు వారికెంతో చేశాడు. ఆయనే వారికి "బుద్ధి నేర్పి బలపరిచాడు." అయితే వారు "ఆయన మీదనే దుర్‌యోచనలు చేస్తున్నారు" (7:15). అంతేగాకుండా వారు ఎప్పుడైన తమ జీవితాలను మార్చుకుంటే అది దేవునికి అనుకూలంగా కాదు. వారు "అక్కరకు రాని విల్లువలె" ఉన్నారు (7:16).[8] వుడ్ ఇలా వ్రాస్తున్నాడు, "ప్రజలు అన్ని వైపులా తిరుగుతున్నారు గాని వారిని రక్షించే ఆయన ఉన్న పైవైపు చూడడం లేదు. బాణాన్ని వక్రమార్గంలో పంపించిన విల్లువలె వారు అన్ని మార్గాలను ఆశ్రయిస్తున్నారు."[9] బట్లర్ ప్రకారం,

> ఇశ్రాయేలు మార్పు చెందుతుంది కానీ సరైన దిశలో కాదు. అది తన లక్ష్యాన్ని కోల్పోతుంది. లక్ష్యం వైపు వెళ్ళడం లేదు. అది అక్కడా ఇక్కడా తిరుగుతుంది సర్వసృష్టికర్త దగ్గరకు వెళ్ళడం లేదు. వక్రమైన విల్లువలె లక్ష్యాన్ని గాకుండా ప్రక్కకు పోయిన బాణాన్ని విసిరిన విల్లులా వారున్నారు. ఇశ్రాయేలు ఎటు తిరిగినా అది లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. ఎందుకంటే అది ఎప్పుడూ దేవుని వాక్యం నుండి తప్పిపోతునే ఉంది.[10]

ఇశ్రాయేలు గమనం తప్పడం యొక్క ప్రతిఫలం ఏమంటే, దాని అధిపతులు "కత్తిచేత కూలుతున్నారు." దేశమంతయు "ఐగుప్తు దేశములో బానిసగా" ఉండడాన్ని వారు చూడనున్నారు. ఇది ఇశ్రాయేలు యొక్క అష్షూరు చెరను సూచించవచ్చు (7:16). ఇశ్రాయేలు ఎంతో కాలం క్రితం ఐగుప్తులో బానిసగా ఉండింది. మరలా అదే విషయం మరోమారు జరుగనుంది.

## అన్వయింపు
## హోషేయ 7

### దేవుడు జ్ఞాపకం చేసుకుంటాడు (7:2)

"తమ క్రియల చేత వారు చిక్కు పడి యున్నను అవి నా సముఖముననే జరిగినను – మన చెడుతనమును ఆయన జ్ఞాపకము చేసికొనడని తమలో తాము అనుకొందురు." అని హోషేయ 7:2లో చూస్తున్నాము. దేవుడు మరచిపోడనే సంగతిని ఇశ్రాయేలీయులు మర్చిపోయుంటారు. వారు ఒక రోజున పాపం చేసి మరుసటి దినాన్నే దేవుడు దాన్ని మరచిపోయాడని అనుకుని మరలా పాపం చేయుటకు తలంచిన వారు ఇశ్రాయేలీయులు.

కానీ, వారి ఆలోచన తప్పు. దేవుడు ప్రతిదాన్ని జ్ఞాపకముంచుకుంటాడు! నిన్న ఏం జరిగిందో గుర్తుంచుకోలేని వృద్ధుడు కాడు ఆయన (చూడండి 7:9). నిన్న ఏమి జరిగిందో గుర్తుకు తెచ్చుకోలేని వాడు కాదు. ఆయన జ్ఞాన సంపూర్ణుడు, దేనిని మరువడు.

మనం ఆ విషయాన్ని గుర్తించాలి. మనం ఏదైనా తప్పుచేస్తే మన సమాజం దాన్ని మర్చిపోవాలని కోరుకుంటాం. మనం దాన్ని మరలా జరిగించకుంటే మనం అందరి చేత అంగీకరించబడతాము.

మన మరుపునకు భిన్నంగా దేవుడు అన్నిటిని గుర్తుంచుకుంటాడు. మన దోషాలను మర్చిపోయేందుకు సమయం ఆయనకు కారణం కాదు. మనం యాభైయేళ్ళ క్రితం పాపం చేసినా దాన్ని అందరూ మర్చిపోయినా ఆయన మాత్రం మర్చిపోడు.

ఆయన ప్రతి పాపాన్ని గుర్తుంచుకుంటాడు. "అయితే" ... ఆ "అయితే" అన్న

మాటలోనే సువార్త శుభవార్త ఉంది. ఆయన ప్రతి పాపాన్ని గుర్తుంచుకుంటాడు. అయితే వాక్యానుసారంగా మనం పాపక్షమాపణను కోరుకుంటే ఆయన మరచిపోడు. పాపక్షమాపణకై మనమాయన వైపు తిరిగితే ఆయన క్షమించి మన పాపములను ఇక ఎన్నటికీ గుర్తుంచుకోడు (హెబ్రీయులకు 8:12).

మనం చేసిన ప్రతి దోషాన్ని దేవుడు గుర్తుంచుకుంటాడు కానీ దాన్నీ ఆయన మర్చిపోయేలా మనమే చేయాలి! విశ్వాసం, విధేయతో మనమాయన వైపు తిరిగితే మన దోషములను క్షమించి ఇక "ఎన్నటికీ వాటిని జ్ఞాపకం చేసుకోడు."

## దేవుని మీద అబద్ధములు చెప్పడం (7:13)

"వారు నా మీద తిరుగుబాటు చేసియున్నారు; వారికి క్షయము సంభవించును. నేను వారిని విమోచింప కోరియున్నను వారు నా మీద అబద్ధము చెప్పుదురు" (7:13). దేవుని మీద ఇశ్రాయేలు ఎలాంటి అబద్ధాలు చెప్పింది? వాక్యం వివరించడం లేదు కానీ ఎన్ని శ్రమలు దేవుడు ఇచ్చినా దేవుడు వారిని నశింపనియ్యడని వారు ఒకరితో ఒకరు చెప్పుకొనియుంటారు. అలాగే దేవుడు తన ప్రజల గురించి పట్టించుకోడు అని వారేం చేసినా చూడనట్లుంటాడని లేదా ఆయన చెప్పినవి వారికి కలుగజేయడని చెప్పుకొని యుండవచ్చు.

ప్రజలింకనూ దేవుని మీద అబద్ధాలు చెప్తుంటారు. ఒక్కసారి ఇలాంటి మాటలు వింటుంటాము:

- "దేవుడెంతో ప్రేమ, దయ, కృప గలవాడు ఆయన ఎవరినీ శిక్షించడు."
- "దేవుడెంతో క్రూరం గలవాడు ఎవరినీ క్షమించడు. మన ప్రేమ, భక్తికి ఆయన పాత్రుడు కాడు."
- "దేవుడు మొదట్లోనే ఈ లోకాన్ని సృష్టించాడు. ఇక దాన్ని గురించి ఆయన పట్టించుకోడు. ఆయన తన భవంతిలో ఉండి విశ్రాంతి తీసుకుంటూ లోకంలో ఏం జరిగినా చూడడు."
- "దేవుడంటే మన చుట్టూ ఉన్నదే: కొండలు, లోయలు, సూర్యుడు, వర్షం, రాళ్ళు, రప్పలు, చెట్లు, పుట్టలు–ఇవన్నీ దేవుడే. ప్రకృతి మరియు దేవుడు ఒక్కటే."
- "దేవుడనే భావన మనకు సహాయ పడుతుంది, కానీ ఆయనను గూర్చిన కథలను మనం పెద్దగా అవన్నీ పుక్కిలు పురాణాలు–అవివినడానికి వినోదంగాను అహ్లాదకరంగా ఉంటాయి, కానీ సత్యం కావు."
- "ప్రాచీన మానవుడి సృష్టే దేవుడు; తనకు అర్థం కానివి దైవంగా అతడు అనుకున్నాడు. దానికి సైన్సు జవాబు ఉంది. మనం ఇప్పుడు దేవున్ని నమ్మక్కర్లేదు."
- "దేవుడున్నాడు, అయితే చాలా మందిలో ఆయన కూడ ఒకడు. ఆయనకులానే ఇతరులూ ఉన్నారు."
- "ఇది వరకటి దేవుడు తనకు విధేయంగా ఉండేవారిని ఆదరించేవాడు. కానీ ఇప్పుడేమో పట్టించుకోనట్లేదే నమ్మకం ఉంటే చాలు రక్షించబడినట్లే."
- "దేవుడికి మతం లేదు నువ్వు ఇతరులకు సహాయం చేస్తే చాలు నువ్వు మంచి పనులు చేస్తే నీ మతం ప్రాంతం ఏదైనా నువ్వు మోక్షానికి వెళ్ళినట్లే."

అటువంటి మాటలు చెప్పేవారు అబద్ధికులు. వారు దేవుని ఘనతను దోచేస్తున్నారు; ఇశ్రాయేలీయులు ఆయన మీద అబద్ధాలు చెప్పినట్లే వీరు కూడ అదే పని చేస్తున్నారు. వారి పనికి జవాబుదారులు.

## హృదయపూర్వక భక్తి (7:14)

పాత నిబంధనలోని మతము, భక్తి అంతయూ బాహ్యక్రియల – సంబంధించినవేనని కొందరు చెప్తుంటారు. అనగా పాత నిబంధనలో దేవుడు, ఒక వ్యక్తి యొక్క ఆచారాలు, ధర్మశాస్త్ర విధులను గురించి మాత్రమే కానీ అతని హృదయం గురించి పట్టించుకోడని చెప్తారు. అయితే దేవుడు తన్ను ఆరాధించు వారి హృదయం గురించి కూడా పట్టించుకుంటాడని హోషేయ 7:14 చెప్తుంది. ఇశ్రాయేలీయులు తమ పడకల మీదనే ఉండి ఆయనకు మొర్రపెట్టినా, కేకలు వేసినా, దీర్ఘంగా ప్రార్థించినా అది "వారి హృదయం నుండి వచ్చింది" కాదు. వారు గుంపులుగా ఆలయం యొద్ద కూడుకుంటారు ("మనం సంఘానికి వెళ్లినట్లు"). అయితే వారు దేవున్ని ప్రేమించినందుకు, ఆయన్ను ఆరాధించేందుకు గాక తమకు మంచి ధాన్యం, మద్యం కావాలని ఆడిగినందుకు వారు ఆలయానికి వస్తారు. తమ ధార్మిక ఆచారాల్లోనూ దేవునికి దూరంగా ఉన్నారు. దేవునికి హృదయ పూర్వక ఆరాధన కావాలి. అది లేనప్పుడు అదంతయూ వ్యర్థమే వేషధారణయే!

దేవుడు పాత నిబంధనలో హృదయపూర్వక భక్తిని కోరుకుంటుంటే, అదే దేవుడు ఈనాడు క్రొత్త నిబంధనలోనూ దాన్నే కోరుకోడా? క్రైస్తవుడయ్యేందకు, ఒకరు క్రీస్తు సువార్తకు హృదయపూర్వకంగా లోబడియుండాలి (రోమీయులకు 6:17, 18). తరువాత నుండి అతడేం చేసినా క్రీస్తు నిమిత్తం హృదయపూర్వకంగా చేయాలి.

---

సూచనలు

[1]Leon J. Wood, "Hosea," in *The Expositor's Bible Commentary,* vol. 7, *Daniel-Minor Prophets,* ed. Frank E. Gaebelien (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1985), 196. [2]పోల్చండి 2 పేతురు 3:9. [3]"సమరయ," ఉత్తర రాజ్యం యొక్క రాజధాని, దేశన్నంతటిని చెప్పేందుకు ఈ పేరును చెప్తారు; 1వ వచనంలో ఇది "ఇశ్రాయేలు" మరయు "ఎఫ్రాయిముగా" చెప్పబడింది. మూడు కూడ ఉత్తర రాజ్యాన్నే సూచిస్తున్నాయి. "ఇశ్రాయేలు" దేశం పేరుగా, "ఎఫ్రాయిము" దేశంలోని ప్రధాన గోత్రం, మరియు "సమరయ" రాజధాని నగరం, ప్రత్యేకించి దేశన్ని పాలించు తరగతిని సూచిస్తుంది. [4]"దొంగ" వేరు "బందిపోటు" దొంగ వేరు. దొంగ ఇళ్ళలో దొంగతనాలు చేస్తే, బందిపోటు దారులు, దారి కాచి దోచుకుంటారు. [5]Philip G. Camp, "Hosea," in *The Transforming Wood: One-Volume Commentary on the Bible*, ed. Mark W. Hamilton (Abilene, Tex.: Abilene Christian University Press, 2009), 669. [6]Paul T. Butler, *The Minor Prophets: The Prophets of the Decline-Obadiah, Joel, Jonah, Amos, Hosea,* Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1968), 504. [7]Francis I. Andersen and David Noel Freedman, *Hosea*, The Anchor Bible (Garden City, N.Y.: Doubleday & Co., 1980), 462. [8]NIV దీన్ని "వక్ర బాణం" అని చెప్తుంది. [9]Wood, 199. [10]Butler, 506-7.